జ్ఞాపకాల మదిలో..

- 1953 అక్టోబరు 1న తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆవిర్భవించిన ఆంధ్రరాష్ట్రం
- 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటు
- అప్పటి రాజధాని కర్నూలులో అలనాటి స్మృతులు నేటికీ పదిలం



ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా ఎస్టీబీసీ కళాశాల్లో ప్రసంగిస్తున్న నాటి ప్రధాని నెహ్రూ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1953 అక్టోబరు 1న ఆవిర్భవించిన ఆంధ్ర రాష్ట్రం తొలి రాజధానిగా కర్నూలు నగరం చరిత్రలో నిలిచింది. నాటి ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి వంటి ప్రముఖులు కర్నూలు నుంచే పాలన సాగించారు. అలాగే ఉప ముఖ్యమంత్రులుగా నీలం సంజీవరెడ్డి (తర్వాతి కాలంలో భారత రాష్ట్రపతి అయ్యారు), ప్రధాన శాఖలకు మంత్రులుగా దామోదరం సంజీవయ్య (తర్వాత తొలి దళిత ముఖ్యమంత్రి), సర్దార్ గౌతు లచ్చన్న, పట్టాభిరామయ్య, తెన్నేటి విశ్వనాథం, తిమ్మారెడ్డి, స్పీకర్‌గా నల్లపాటి వెంకట్రామయ్య, పసల సూర్యచంద్రారావు, చీఫ్ సెక్రటరీగా ఒ.పుల్లారెడ్డి వంటి ప్రముఖులు పాలన సాగించారు. అనంతర కాలంలో 1956 నవంబరు 1న నాటి హైదరాబాదు స్టేట్‌లోని తెలంగాణ ప్రాంతాలను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయింది. కర్నూలు వాసుల త్యాగనిరతితో రాష్ట్ర రాజధాని కూడా హైదరాబాదుకు తరలిపోయింది. అయితే తొలి ఆంధ్ర రాష్ట్ర రాజధానిలో ముఖ్యమంత్రి నివాసం, గవర్నర్ బంగ్లా, సచివాలయం, శాసన సభ తదితర భవనాలు నేటికీ ఆనాటి వైభవాన్ని చాటిచెబుతూ జ్ఞాపకాలను మనముందు ఉంచుతున్నాయి. ఆనాటి తొలి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు వెనుక జరిగిన కృషి, జాతీయ నాయకుల కర్నూలు పర్యటన, తొలి రాజధానిలో ఆనాటి ఆంధ్రరాష్ట్ర అవతరణ అంశాలను నేటితరానికి తెలియజేసేలా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలు 1952 డిసెంబరు 19 వరకు (నాటి ప్రధాని నెహ్రూ లోక్‌సభలో ప్రకటన చేసేవరకు) ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే ఒక భాగంగా ఉండేవి. తెలంగాణ ప్రాంతం హైదరాబాదు రాష్ట్రం కింద ఉండేది. ప్రత్యేక రాష్ట్రం కోసం సభలు, సమావేశాలు ఏర్పాటు చేయసాగారు. కర్నూలు నుంచి కూడా ప్రత్యేక రాష్ట్రం కోసం తీర్మానాలు చేసి పంపించారు. రాయలసీమ, ఆంధ్ర ప్రాంత ప్రజలు 1938లో శ్రీబాగ్ ఒప్పందంతో పరస్పర అనుమానాలు వదులుకొని కలిసి పోరాడారు.

మిగతా 6వ పేజీలో

సీసీఐ మాయాజాలం

- పత్తి అమ్మాలంటే ఎన్ని కష్టాలో..
- 4 కేంద్రాల్లోనే కొనుగోలు
- ఉమ్మడి జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- తేమ సాకుతో మద్దతు ధరకు దూరం చేస్తున్న అధికారులు



పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి



ఈ రైతు పేరు సుభాన్. గూడూరు మండలం మల్లాపురం. ఈ రైతు నాలుగెకరాల్లో ఖరీఫ్‌లో పత్తి పంటను సాగు చేశాడు. ఎకరాకు రూ. 50వేలకు పైగా ఖర్చు చేశాడు. 40 క్వింటాళ్ల పత్తిని అక్టోబరు 30న పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. అక్కడున్న అధికారులు నవంబరు 4న రావాలని తిప్పి పంపారు. సీసీఐ అమలు చేస్తున్న కపాస్ కిసాన్ యాప్‌లో పత్తిని అమ్మేందుకు వివరాలు నమోదు చేసుకుంటే 30వ తేదీన రావాలని మెసేజ్ వచ్చిందని, తీరా ఇక్కడికి వస్తే తిప్పి పంపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఎంతో ఖర్చు పెట్టుకొని పత్తి విక్రయించడానికి వచ్చానని ఆయన అన్నాడు.

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా లేవు. సీసీఐ కొత్త నిబంధనల మాయాజాలంలో పత్తి రైతులు మద్దతు ధరకు దూరం అవుతున్నారు. పత్తి విక్రయించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 5.50లక్షల ఎకరాల్లో పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేశారు. నంద్యాల జిల్లాలో 12వేల ఎకరాల్లో మాత్రమే పత్తి పంట సాగైంది. సీసీఐ అధికారులు సవాలక్ష అడ్డంకులు పెడుతూ అక్టోబరు 30న గూడూరు మండలంలోని పెంచికలపాడు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోనిలోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మొదటి రోజే వందలాది మంది రైతులు వేయి క్వింటాళ్లకు పైగా పత్తిని అమ్మకానికి తీసుకువచ్చారు. కొనుగోలు చేసింది మాత్రం 17 మంది రైతుల నుంచి 273 క్వింటాళ్లు మాత్రమే. ఇంకోపక్క విధిలేక వ్యాపారులకు వేలాది మంది రైతులు ఇప్పటికే లక్ష క్వింటాళ్ల దాకా పత్తిని క్వింటం రూ.6వేల నుంచి రూ.6,500కే అమ్ముకున్నారు. ఈ సంవత్సరం 33 లక్షల క్వింటాళ్లకు పైగానే రైతుల చేతికందింది. సీసీఐ అధికారుల నిర్లక్ష్యాన్ని చూస్తే ఈ మొత్తం పత్తిని రైతుల నుంచి కొనేలా కనిపించడం లేదు. 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు చెప్పినా.. ఆచరణలో 30వ తేదీన కేవలం 4 కేంద్రాలను మాత్రమే ఏర్పాట్లు చేశారు.



సీసీఐ కేంద్రానికి వచ్చిన రైతులు

రైతుల మెడపై వేలాడుతున్న తేమ కత్తి

పత్తిని మార్కెట్‌లో విక్రయించే సమయంలో తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో పొడి తగ్గిపోయింది. కనీసం పత్తిని ఆరబెట్టలేని పరిస్థితి. మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు క్వింటానికి రూ.6వేల నుంచి రూ.6,500కు మాత్రమే కొంటామని, లేకపోతే వెనక్కు తీసుకెళ్లాలని మొఖం మీదనే చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటానికి రూ.8,110 ఇస్తామని చెప్పడమేగాని, ఆ ధర ఇవ్వడం లేదని, తేమ శాతం 12కి మించితే ఒక క్వింటం కూడా కొనేది లేదని సీసీఐ అధికారులు అంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. 8 శాతం తేమ ఉంటేనే క్వింటానికి రూ.8,110 చెల్లిస్తామని, ఆ తర్వాత 8 నుంచి 12 శాతం మధ్య ఉంటే ధరను తగ్గిస్తామని అంటున్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఒక పెద్ద అబద్ధమని రైతులు అంటున్నారు. తేమ శాతం ఒక శాతం పెరిగితే క్వింటానికి రూ.81లు కోత విధిస్తామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. 12 శాతం మించి పత్తిలో తేమ ఉంటే.. ఒక్క క్వింటం కూడా కొనమని అధికారులు స్పష్టం చేశారు.

మిగతా 6వ పేజీలో



ట్రావెల్స్‌పై కొరడా

- ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు ఆర్టీవో అధికారుల జరిమానాలు
- ఐదు నెలల్లో ఫైన్ల రూపంలో రూ.25.89 లక్షల వసూలు

డోన్ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీవో అధికారులు కొరడా ఝుళిపించారు. డోన్ హైవేపై నిబంధనలు ఉల్లంఘిస్తూ తిరుగుతున్న ట్రావెల్స్ బస్సులకు భారీ జరిమానాలు విధించారు. ఐదు నెలల్లో ఏడు ట్రావెల్స్ బస్సుల నుంచి ఫైన్ల రూపంలో రూ.25.89 లక్షలు వసూలు చేశారు. ఈ సంవత్సరం జూన్ నెలలో 5వ తేదీన ఒక ట్రావెల్ బస్సుకు రూ.3.60 లక్షలు, జూలై 1న మరో ట్రావెల్ బస్సుకు రూ.4.19లక్షలు జరిమానా వేశారు. సెప్టెంబరు 21న నిబంధనలు ఉల్లంఘించిన ఒక ట్రావెల్ బస్సుకు రూ.3.73లక్షలు అదే నెల 26న ఇంకో బస్సుకు రూ.4.19లక్షలు, అదే నెల 26న తప్పుడు నెంబర్ ప్లేట్, తప్పుడు రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న ఓ ట్రావెల్ బస్సుకు రూ.4.50 లక్షలు, అదే నెల 19న ఓ ట్రావెల్ బస్సుకు రూ.4.43 లక్షలు ఫైన్లు విధించారు. అక్టోబరు 7న అక్రమంగా నడుస్తున్న ఓ ట్రావెల్ బస్సుకు భారీ జరిమానాలు విధించినట్లు డోన్ ఆర్టీవో క్రాంతికుమార్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇటీవల చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారిపై నిబంధనలు ఉల్లంఘించి తిరుగు తున్న కావేరి ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురి కావడం విదితమే. గతంలోనే ట్రావెల్ బస్సుల కట్టడికి డోన్ ఆర్టీవో అధికారులు కృషి చేస్తున్నారు.



హైవే పై ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్ (ఫైల్)

కఠిన చర్యలు తప్పవు



జాతీయ రహదారిపై నిబంధనలు అతిక్రమించి ట్రావెల్స్ బస్సులు నడిపితే కఠిన చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానాలు విధిస్తాం. అక్రమంగా రోడ్లపై వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటాం.

● క్రాంతి కుమార్, ఆర్టీవో, డోన్

నాపరాళ్ల పరిశ్రమను ఆదుకుంటాం

- రాయల్టీ విషయంపై సీఎంతో చర్చిస్తా
- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నాపరాళ్ల పరిశ్రమను ఆదుకుంటామని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బెలుంగుహల ఆవరణంలో నంద్యాల, అనంతపురం జిల్లాలకు చెందిన నాపరాళ్ల గనులు, పాలిషింగ్ యూనిట్స్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. రాయల్టీ వసూలు ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో పెద్దఎత్తున భారం పడుతోందని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి బీసీ మాట్లాడుతూ సంబంధిత శాఖ మంత్రి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి నాపరాళ్ల పరిశ్రమను ఆదుకోవడానికి కృషిచేస్తానన్నారు. 2014లో, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలోనూ నాపరాళ్ల పరిశ్రమను ఆదుకున్నది తామేనన్నారు. రాయల్టీ విషయంపై సీఎంతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, పేట్నీకోట హుస్సేన్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, గూలి నాగేశ్వరరెడ్డి, అంబటి వివేకానందరెడ్డి, విజయ్, ఓబయ్య, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

శాంతి భద్రతల్లో రాజీ పడకండి: ఎస్పీ

నంద్యాల టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో పోలీసులు ఎక్కడా రాజీ లేకుండా, ఎవరికీ భయపడకుండా పని చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, సైబర్‌క్రైం వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సీసీటీఎన్ఎస్ ఆధారంగా కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. నేరాలను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలన్నారు. స్థానికంగా నమోదయ్యే కేసులు వెంటనే సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. గ్రేవ్ కేసులు, యూటీ కేసులు, పీటీ కేసులు మర్డర్ కేసులు, సైబర్‌క్రైం, మిస్సింగ్ కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులు ఆరా తీసి, వాటి పురోగతిని సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ పోలీసులు, ఏఎస్పీలు, మందా జావళి, యుగంధర్‌బాబు, ఎస్పీ డిఎస్పీ శ్రీనవాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పటేల్ జయంతి



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్పీ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఎస్పీజీ మైదానంలో 250 మంది విద్యార్థులతో, పోలీసు సిబ్బందితో ఐక్యతా పరుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఏకతాటిపై నడిపించిన ఏకైన వ్యక్తి పటేల్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు కంబగిరిరాముడు, ఈశ్వరయ్య, అస్రర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

84 పెద్ద పులులు

- నేటి నుంచి టైగర్ రిజర్వ్‌లో 6వ విడత పులుల గణన
- 13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఎన్ఎస్‌టీఆర్
- 90 బేస్ క్యాంపులు.. 490 మంది సిబ్బంది
- కొత్తగా ఎస్‌పీటీఎఫ్ కొత్త దళం : ఎఫ్‌డీపీటీ విజయ్ కుమార్



రుద్రవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : నల్లమల శ్రీశైలం టైగర్ రిజర్వులో 84 పెద్ద పులులు ఉన్నట్లు ఎఫ్‌డీపీటీ విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రుద్రవరం ఫారెస్టు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి ఆరో విడత పెద్ద పులుల లెక్కింపు ఫేజ్-1కు శ్రీకారం చుట్టామన్నారు. నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో 23 ఫారెస్టు రేంజ్‌లు, 180 బీట్లు, 13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఎన్ఎస్‌టీఆర్ విస్తరించి ఉందన్నారు. రాష్ట్రంలో 2,400 బీట్లలో లెక్కింపు ప్రారంభమవుతుందని అన్నారు. 90 బేస్ క్యాంపుల్లో 490 మంది సిబ్బంది పని చేస్తున్నారన్నారు. వీటిలో ఏడాది నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో పోస్టు ఖాళీగా ఉందన్నారు. అలాగే ఆరు నెలలుగా బయో డైవర్సిటీ ల్యాబ్ ఏసీఎఫ్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో 23 మంది రేంజర్లు పని చేయాల్సి ఉండగా 20 మంది ఉన్నారన్నారు. 180 మంది బీట్ ఆఫీసర్లు ఉండాల్సి ఉండగా 110 మంది మాత్రమే ఉన్నారన్నారు. నంద్యాల, ఆత్మకూరు డివిజన్‌లో ఐదు చొప్పున ఫారెస్టు రేంజిలు, గిద్దలూరు డివిజన్‌లో ఆరు రేంజిలు, మార్కాపురం డివిజన్‌లో ఏడు రేంజిలు ఉన్నాయన్నారు. ఎన్ఎస్‌టీఆర్‌లోకి ఎస్‌పీటీఎఫ్ కొత్తగా ఒక దళాన్ని ప్రవేశ పెడుతున్నామని ఆయన అన్నారు. ఆయన వెంట రేంజర్ ముర్తుజావలి, ఇన్‌చార్జి డీఆర్వో ముక్తార్ బాషా, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌ఖాన్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నంద్యాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో వినతులను స్వీకరించారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలపాలని కోరారు. అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతా యన్నారు. స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

శ్రీశైలం నుంచి నీటి విడుదల

శ్రీశైలం అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతం నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి పెరగడంతో క్రస్ట్‌గేట్‌ను ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. ఈ సంవత్సరం పదోసారి గేట్లను ఎత్తినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. శుక్రవారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 46,211 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 22,230 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 72,760 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వస్తోంది. అదేవిధంగా జలాశయం ఒక క్రస్ట్ గేట్ పది అడుగుల ఎత్తులో తెరిచి 27,937 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 27,041 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వారా 35315, మొత్తంగా 90,292 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా 884.60 అడుగులు, పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 213.401 టీఎంసీలుగా నమోదైంది.



సీఐ రామును వరించిన అరుదైన గౌరవం

● పురస్కారానికి ఎంపిక

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా

6

రికార్డులను సరిగా నిర్వహించాలి

మద్యం డిపో తనిఖీలో జేసీ కార్తీక్



రికార్డులను తనిఖీ చేస్తున్న జేసీ కార్తీక్

నంద్యాల టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మద్యం డిపోలో స్టాక్‌కు సంబంధించి రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణ శివారులో ఉన్న మద్యం డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులను అడిగి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిపో ఉన్న ఐఎంఎఫ్ఎల్, బీర్ స్టాక్ వివరాలు ఓపెనింగ్ బ్యాలెన్స్ సంబంధించి రికార్డులన్నీ తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ నగేశ్, సూపర్‌వైజర్ కోటిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో గడప దాటని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం శవ రాజకీ యాలు చేసే జగన్ తుఫాన్‌ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు కనిపించలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం రాత్రి, పగలు సహాయక కార్యక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఏదో ఒకటి బురదజల్లే కార్యక్రమాలను చేపట్టి విషయాన్ని పక్కదారి పట్టించే విధంగా విమర్శలు చేయడాన్ని తప్పు పట్టారు. ఇకనైనా చంద్రబాబు గురించి చౌకబారు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

● రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

● జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా, సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ

ఆళ్లగడ్డ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిస కావొద్దని జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై న్యాయ శాఖ, పోలీసు అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కోర్టు ఆవరణ నుంచి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ, డీఎస్పీ ప్రమోద్, జేఎఫ్‌సీ భాస్కర్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, టౌన్ సీఐ యుగంధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, సీనియర్ న్యాయవాదులు సూర్యనారాయణ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రమాదేవి, నీలకంఠేశ్వరరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

● కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బాధితులతో కలెక్టర్, ఎస్పీ సునీల్ షెరాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలిస్తామని సుమారు 850 మంది బాధితుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.3.6లక్షలు హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సంస్థ వసూలు చేసిందన్నారు. బాధితులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తే త్వరగా న్యాయం చేస్తామన్నారు. ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుల సహకారంతో విచారణ మరింత వేగవంతం అవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పాల్గొన్నారు.

విశ్వశాంతి యాగం ప్రారంభం

● పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి దంపతులు



ఆశీర్వాదం అందజేస్తున్న స్వరూపానంద స్వామిజీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శుక్రవారం శ్రీకృష్ణమఠం పీఠాదిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ప్రారంభమైంది. తొలిరోజు ప్రారంభ పూజల్లో స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దంపతులు పాల్గొన్నారు. యాగశాలలో గణపతి పూజ, శుద్ధి పుణ్య హావాచనం, పంచగవ్వ ప్రాశాన, రుత్విక్ వరుణ, గోసహిత యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి స్థాపన, వంటి పూజలను స్వామి ఆద్వర్యంలో నిర్వహించి మహాయాగానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా అతి రుద్రహోమ పూజలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. స్వామిజీ ఎమ్మెల్యే దంపతులకు ఫలపుష్ప మంత్రాక్షితలిచ్చి ఆశీస్సులు అందజేశారు. టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, మహేంద్ర బాబు, మాచాని మహేష్, మాచాని శివశంకర్, రంగస్వామిగౌడ్, వెంకటేశప్ప రాజు, వాల్మీకి రాజు, నరసప్ప, గిరి, డీలర్ ఈరన్న, కొండన్న గౌడ్, ఎన్వీ రామాంజనేయులు పాల్గొన్నారు.

జ్ఞాపకాల మదిలో..

5వ పేజీ తరువాయి

కానీ జాతీయోద్యమం ఉధృతంగా ముందుకు రావడంతో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కొంతకాలం కనుమరుగైంది.

స్వాతంత్ర్యానంతరం తిరిగి తెరపైకి...

స్వాతంత్ర్యం లభించాక ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం డిమాండ్ మొదలైంది. 1948 జూన్ 17న రాజ్యాంగ సభ ఒక కమిటీని నియమించింది. దీనికి ఎస్‌కే మంజుదార్ అధ్యక్షుడిగా ఉండగా, డాక్టర్ పన్నాలాల్, జగత్ నారాయణ్‌లాల్ సభ్యులు. వీరి పరిపాలన సౌలభ్యం ప్రాతిపదికనే రాష్ట్రాల విభజన జరగాలని, భాషా ప్రయుక్త రాష్ట్రాల వలన దేశ సమైక్యతకు భంగం కలుగుతుందని చెప్పారు. దీనిపై అనేక భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. కేంద్రం మరో కమిటీని వేసింది. అందులో నాటి ప్రధాని నెహ్రూ, పటేల్, పట్టాభి సభ్యులు. దీన్ని జేవీపీ కమిటీ అంటారు. వీరు 1952లో ఒక నివేదిక ఇస్తూ ఆంధ్రులు మద్రాసు రాష్ట్రం వదులుకుంటూ ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందని చెప్పారు. అందుకు చాలామంది నేతలు ఒప్పుకోలేదు. దాంతో సమస్య తెగలేదు.

పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షతో...

ఈ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 1952లో నిరవధిక నిరాహార దీక్షకు దిగి 53రోజుల తర్వాత అమరుడయ్యారు. ఆయన ప్రాణత్యాగంతో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతం భగ్గుమంది. ప్రభుత్వ కార్యాలయాలు తగలబడ్డాయి. బస్సులు, రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో అప్పటి ప్రధాని నెహ్రూ 1952 డిసెంబరు 19న లోక్‌సభలో ప్రకటన చేశారు. బళ్లారి, మద్రాసు ప్రాంతాలను మినహాయించి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించారు.

గుడారాల రాజధాని : ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక పరిపాలన సజావుగా సాగడానికి దాదాపు 4 వేల మంది అధికారులను ప్రభుత్వం నియమించుకుంది. కానీ అప్పటికి నగరం పూర్తిగా అభివృద్ధి కాలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ సహాయంతో మిలటరీ వారు వాడే గుడారాలను తెప్పించి, వాటిని కార్యాలయాలుగా మార్చివేశారు. అవి ఎ.క్యాంపు, బి.క్యాంపు, సి.క్యాంపులుగా ఉండేవి. తర్వాత వాటి స్థానంలో భవనాలు నిర్మించారు. అవే ఇప్పుడు నగర నడిబొడ్డున ఏ,బీ,సీ క్యాంపులు. అలా తొలి రాజధానిని టెంటెడ్ క్యాపిటల్ అని పిలిచేవారు.



నాటి శాసన సభలో ప్రసంగిస్తున్న నెహ్రూ

కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఆవిర్భావం

స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు సూచనల మేరకు ప్రధాని నెహ్రూ కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేశారు. అలా 1953 అక్టోబరు 1న ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా, కర్నూలు రాజధానిగా 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్ర అవతరణ కార్యక్రమం నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఘనంగా జరిగింది. ప్రధాని నెహ్రూతో పాటూ నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విచ్చేశారు.



నాటి సచివాలయం - నేటి వైద్యకళాశాలలోని భవనం

తొలి రాజధానిలోని వివిధ కార్యాలయాలు

- శాసన సభ: ప్రస్తుతం కొత్తపేట సమీంలోని జిల్లా కోర్టు ఆనాటి శాసనసభ. మూడేళ్ల నాటి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, సందర్శకులతో ఈ ప్రదేశం కళకళలాడేది.
- సచివాలయం : రాష్ట్ర పరిపాలన వ్యవహారాలు చూసే సచివాలయం ప్రస్తుతం పెద్దాసుపత్రిలో ఉంది. ఇది వైద్య విద్య అభ్యసించే విదార్థుల భవనంగా ఉంది.
- గవర్నర్ నివాసం : నాటి తొలి గవర్నర్ సీఎం త్రివేది నివాసంగా మార్చుకున్న గవర్నర్ బంగళా నేడు కేవీఆర్ మహిళా కళాశాలగా సేవలందిస్తోంది.
- శాసన సభ్యుల నివాసాలు : టౌన్ మోడల్ హైస్కూల్‌లోని గదులే నాటి శాసన సభ్యుల నివాస గృహాలు
- ముఖ్యమంత్రి నివాసం : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఎస్టీబీసీ కళాశాల పక్కనున్న ఒకనాటి ఎస్పీ నివాసం సీఎం కార్యాలయంగా పనిచేసేది.
- ప్రస్తుత కలెక్టర్ బంగ్లా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి నివాస గృహంగా ఉండేది.
- ఎక్సైజ్ కార్యాలయం నాటి ఏపీపీఎస్సీ కార్యాలయంగా ఉండేది.



నాటి శాసన సభ - నేటి జిల్లా కోర్టు భవనం

సీసీఐ మాయాజాలం

5వ పేజీ తరువాయి

కపాస్ కిసాన్ యాప్‌తో తలపోటు

కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఎప్పుడు కొనుగోలుకు రావాల్సింది స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రకారం చేశాక, మెసేజ్‌లో సూచించిన తేదీన రైతులు పత్తిని విక్రయానికి తీసికెళ్లితే ఆ తేదీలు రద్దు చేశామని కొత్త తేదీలు సూచిస్తున్నారు. మరి కొందరు రైతులకు అసలు సెల్ ఫోన్‌కు వివరాలే అందడం లేదు. పత్తి కొనుగూడదనే ఉద్దేశంతోనే సీసీఐ అధికారులు ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని రైతు సంఘాల ప్రతినిధులు ధ్వజమెత్తుతున్నారు.



నిబంధనలు పాటిస్తేనే మద్దతు ధర..

పత్తి రైతులు సీసీఐ విధించిన నిబంధనలను పాటించాల్సిందే. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ద్వారా తాము పండించిన పత్తి వివరాలను ఈక్రాప్ విధానంలో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఏ తేదీల్లో అమ్మకానికి పత్తిని తీసుకెళ్లాలో సీసీఐ అధికారుల నుంచి సమాచారం తీసుకోవాలి. రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి కొనుగోలు కేంద్రాలను పెంచుతాం.

● నారాయణమూర్తి, ఏడీఎం

ఇన్ని అడ్డంకులు ఉన్నాయని తెలిస్తే.. మా ఊళ్లోనే అమ్ముకునేవాడిని



నా సొంత పొలం ఐదెకరాలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. సీసీఐ అధికారులు క్వింటానికి రూ.8,110 అందిస్తామనడంతో పెంచికలపాడు కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకెళ్లాను. మళ్లీ రమ్మని తిప్పి పంపారు. ఇన్ని అడ్డంకులు ఉంటాయని తెలిస్తే, ఇంత ఖర్చు పెట్టుకోకుండా మా ఊళ్లోనే అమ్మేసుకొనే వాడిని.

● లాలెప్ప, రైతు, గుడిపాడు



నేటి నుంచి కర్నూలు ఉత్సవ్-2025

● కలెక్టరేట్ నుంచి వెయ్యి మందితో ర్యాలీ

● హాజరుకానున్న ప్రముఖులు



కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేలా, ఏడు రోజుల పాటూ రోజూ 12 గంటల పాటు నిర్విరామ ప్రదర్శనలకు టీజీవీ కళాక్షేత్రం వేదిక అవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటూ 'కర్నూలు ఉత్సవ్-2025' పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు నగరంలోని తెలుగుతల్లి, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పుష్పాలను అర్పిస్తారు. అనంతరం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు వెయ్యి మంది కళాకారులు, రచయితలు, కవులు, గాయకులు, యువతతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ క్వామర్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభిస్తారు. ఈ ర్యాలీలో రవీంద్ర, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేతలు జి. పుల్లయ్య, కేఎస్‌వీ రాజశేఖర్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు. వారం రోజుల పాటూ నిత్యం 12 గంటల పాటు కొనసాగే ఈ వినూత్న కార్యక్రమాలను నమోదు చేసేందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు హాజరవుతున్నారు. గతంలో రెండుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించిన టీజీవీ కళాక్షేత్రానికి మూడో సారి అవకాశం లభించబోతోంది.

● నేటి కార్యక్రమాలు : ఉదయం 11 గంటలకు రవీంద్ర విద్యాసంస్థల విద్యార్థులతో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం 6గంటల వరకు ఏకాంకిక పౌరాణిక నాటక ప్రదర్శనలు కొనసాగుతాయి. సాయంత్రం 6.30 గంటలకు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, కోలాటం ప్రదర్శనలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన న్యూరో సర్జన్ డాక్టర్ డబ్ల్యూ సీతారాం, తెలంగాణ విశ్రాంత డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, డీఈఓ శామ్యూల్ పాల్, సేవా రంగంలో బీసీ రాజారెడ్డి (బనగానపల్లె), విద్యా రంగంలో రామకృష్ణారెడ్డి (నంద్యాల), అరుణాచలం రెడ్డి (కర్నూలు), కేసీ కల్కూర (పూర్వ గ్రంథాలయ సంస్థ చైర్మన్), గండ్లూరి దత్తాత్రేయ శర్మ (అవధానం, డోన్), రజనీబాయి (రంగస్థల నటి, కర్నూలు)లను సత్కరిస్తారు.

ఉమ్మడి జిల్లా ఖ్యాతిని తెలియజేసేలా : పత్తి ఓబులయ్య



ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేలా 'కర్నూలు ఉత్సవ్-2025' వేడుకను నిర్వహిస్తున్నాము. ఈ వేడుక ఉమ్మడి జిల్లా ప్రజలందరి వేడుక. తుంగభద్ర, హంద్రీ, కృష్ణా, కుందూ వంటి జీవ నదులు ఉమ్మడి జిల్లాలో ప్రవహిస్తూ వేనేళ్ల సంస్కృతిని అందిస్తున్నాయి. శ్రీశైలం, అహోబిళం, మహానంది, యాగంటి, మంత్రాలయం వంటి పుణ్యక్షేత్రాలు ఆధ్యాత్మిక, ధార్మిక వైభవాన్ని చాటి చెబుతున్నాయి. ఇక తొలి స్వాతంత్ర్య సమరయోధుల నుంచీ జిల్లా చరిత్రను దేశ చిత్ర పటంలో నిలిపిన రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు అందించిన ఘనత ఈ ప్రాంతానిది. ఎందరో మహనీయులు నడయాడిన ఈనేల చారిత్రక, సాంస్కృతిక, కళారంగ విశేషాలను భావితరాలకు అందించాలన్న ఏకైక లక్ష్యంతోనే ఈ వేడుకలను నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నాం.

సీఐ రామును వరించిన అరుదైన గౌరవం

● పురస్కారానికి ఎంపిక



వరదల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఐ రాము(ఫైల్)

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అర్బన్ సీఐ రాముకు అరుదైన గౌరవం లభించనుంది. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆత్మకూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో పోలీసుశాఖ ద్వారా ప్రజలకు ఆయన సేవలందించారు. దీన్ని గుర్తిస్తూ సీఎం చంద్రబాబు చేతులమీదుగా గౌరవ పురస్కారాన్ని అందజేసేందుకు ప్రభుత్వం ఆయన పేరును ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం అమరావతిలోని ఉండవల్లిలో గల సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగే అవార్డుల ప్రదానానికి హాజరు కావాలని సీఎంవో నుంచి శుక్రవారం సాయంత్రం సీఐకు పిలుపు వచ్చింది. తుఫాన్ నేపథ్యంలో ఆయా వాగుల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా సీఐ రాము విధుల్లో అంకితభావాన్ని ప్రదర్శిస్తూ నిరంతరం పనిచేశారు. వరదల్లో చిక్కుకున్న గ్రామాలకు సైతం వెళ్లి అక్కడి ప్రజల బాగోగుల గురించి తెలుసుకున్నారు. వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటివిడుదల జరిగినప్పటికీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చాలా ఆనందంగా ఉంది



తుఫాన్ సమయంలో తన సేవలను గుర్తిస్తూ సీఎంవో వారు తనను అవార్డుకు ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈఅవార్డు నాలో మరింత బాధ్యత పెంపొందిస్తుందని ఆశిస్తున్నా.

● రాము, అర్బన్ సీఐ, ఆత్మకూరు

కృష్ణమ్మకు జలహారతి



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పరవళ్ల తొక్కుతూ ఉప్పొంగుతున్న కృష్ణమ్మను శాంతించమంటూ నదీమతల్లి విగ్రహా నికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై దశ విధాలుగా జల హారతు లను సమర్పించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊయలసేవ నిర్వహించారు.

కొవ్వొత్తులతో ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రసూన న్యాయ విద్యార్థులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 24న జరిగిన బస్సు ఘోర రోడ్డు ప్రమాదంలో మృతులకు ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులతో శుక్రవారం రాత్రి ఘన నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదాలకు చేరకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహేష్, మాలిక్, సీనియర్ న్యాయవాదులు ఖాద్రి, మోహన్ కృష్ణ, బంగి సుధీర్ పాల్గొన్నారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డాకు సీఎం చంద్రబాబు అభినందన

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని సీఎం చంద్రబాబు శుక్రవారం అభినందించారు. మొంథా తుఫాన్ విపత్తు నేపథ్యంలో శ్రీశైల నియోజకవర్గం పరిధిలో ఎటువంటి అపశ్రుతి చోటు చేసుకోకుండా అధికార యంత్రాంగాన్ని, పార్టీల శ్రేణులను ఎమ్మెల్యే బుడ్డా అప్రమత్తం చేశారు. వరదలతో నిరాశ్రయులైన బాధితులకు అండగా నిలిచారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నారు. శనివారం అమరావతిలోని ఉండవల్లిలో జరిగే సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే బుడ్డా హాజరుకావాలని ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేను అభినందించడంపై స్థానిక కూటమి పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

ఉబికిన గంగమ్మ



మూడు రాళ్లపల్లె పాఠశాల వద్ద బోరు నుంచి ఉప్పొంగుతున్న నీరు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలాలు పెరిగిపోయాయి. చాగలమర్రి మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్దగల బోరు మోటార్ వేయకుండానే గంగమ్మ ఉబికి వస్తోంది. శుక్రవారం బోరు నుంచి నీరు ఎగిసి పడుతోంది. విద్యార్థుల కోసం గతంలో వేసిన బోరు నుంచి నీరు ఉబికి వస్తుండటంతో గ్రామస్థులు ఆశ్చర్యపోతున్నారు. రుద్రవరం మండలంలో సైతం వ్యవసాయ బోరుబావులు పొంగి పొర్లుతున్నాయి. బోరులో నుంచి నీరు ఎగిసి పడుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● చాగలమర్రి/ రుద్రవరం, ఆంధ్రజ్యోతి



రుద్రవరం మండలం డి.కొట్టాల సమీపంలో పొంగుతున్న బోరుబావి




దేశభక్తి గీతానికి మెడికల్ కళాశాల విద్యార్థుల నృత్యం



ఫ్రెషర్స్‌డే వేడుకలో ప్రసంగిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

కేఎంసీ ప్రతిష్ఠను పెంచండి

రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

పంచెకట్టు, చీరల్లో మెరిసిన వైద్య విద్యార్థులు

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బెస్ట్ కాలేజీగా పేరొందిన కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ) ప్రతిష్ఠను మరింత పెంచాలని రిటైర్డు ప్రిన్సిపాల్ డా.పి.సుధాకర్ వైద్యవిద్యార్థులకు పిలుపునిచ్చారు. 2025 బ్యాచ్ వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు కేఎంసీ న్యూఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఫ్రెషర్స్‌డేను 2023 బ్యాచ్ ఎంబీబీఎస్ సీనియర్ విద్యార్థులు విహాన్-2025 పేరుతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.సుధాకర్ మాట్లాడుతూ పేద రోగులే గొప్ప వైద్య బోధకులని, రోగుల బాధలను, ఇబ్బందులను సమస్యలను ఓపికగా వినాలన్నారు. తాను కర్నూలు మెడికల్ కాలేజీలో 45ఏళ్లు వైద్యుడిగా పనిచేశానని తెలిపారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టి నరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ఐహాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ఎం.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

అలరించిన పంచెకట్టు

ఫ్రెషర్స్‌డే సందర్భంగా వైద్య విద్యార్థులు పంచెకట్టు అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థినులు చీరల్లో కనిపించారు. జూనియర్ వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా కేరింతలతో కొనసాగాయి.




వైద్య విద్యార్థుల స్నేహబంధం




పంచెకట్టులో భావి డాక్టర్లు

బస్సు ప్రమాద బాధితుడికి కలెక్టర్ పరామర్శ



ఆర్ఐసీయూలో గుణసాయితో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చిన్నటేకూరు వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్ర అస్వస్థలకు కెమికల్ లంగ్ ఇన్‌ఫెక్షన్‌కు గురైన కోనసీమ జిల్లా కాటలేనికొనకు చెందిన గుణసాయి కోలుకుంటున్నారు. బస్సులో అగ్నికీలాల నుంచి తప్పించుకుని తీవ్ర అనారోగ్యానికి గురై గత నెల 25వ తేదీన కర్నూలు జీజీహెచ్‌లో చేరారు. బస్సులోని మంటల నుంచి పొగను పీల్చడంతో ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్‌తో పాటు అన్నవాహకలోని ఫుడ్ పైప్ దెబ్బతిన్నట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు తెలిపారు. కెమికల్ లంగ్ ఇన్‌ఫెక్షన్‌కు గురి కావడంతో రోగిని ఆర్ఐసీయూలో ఉంచి ముగ్గురు వైద్యులు పర్యవేక్షణలో ఏడు రోజులుగా చికిత్స అందిస్తున్నామన్నారు. పొగ వల్ల ఫుడ్ పైపు కూడా దెబ్బతినగా ఎండోస్కోపి చేసి చికిత్స అందిస్తున్నామన్నారు. నాలుగు రోజుల తర్వాత జనరల్ వార్డుకు షిఫ్ట్ చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ చికిత్స తీసుకుంటున్న గుణసాయిని పరామర్శించారు. అలాగే కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు కూడా ఉదయం రోగిని పరామర్శించారు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత స్టేట్ గెస్టు హౌస్‌లో ఉంచి స్వస్థలానికి పంపిస్తామని చెప్పినట్లు రోగి తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

● ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



మాట్లాడుతున్న వీసీ వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న నిర్వహించనున్న 4వ స్నాతకోత్సవంకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) వీసీ వెంకట బసవరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌యూలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ కమిటీల కన్వీనర్లు, సభ్యులతో ఆయన సమీక్షించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్నాతకోత్సవ నిర్వహణలో ఎటువంటి లోటు పాట్లకు తావులేకుండా తగిన ప్రణాళికలను రూపొందించుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. వివిధ పీజీ కోర్సుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ, డిగ్రీ ప్రదానానికి తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచిం చారు. రాజ్‌భవన్ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ స్నాతకోత్సవ ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాల్సిందిగా ఆదేశించారు. సమావేశంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌నాయుడు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, నరసింహులు, ప్రొఫెసర్లు సుందరానందపుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

● మరొకరికి గాయాలు

ఆళ్లగడ్డ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. కడప పట్టణానికి చెందిన రమణారెడ్డి, వినయ్ సొంత పనుల నిమిత్తం కారులో కడప నుండి కర్నూలుకు బయలుదేరారు. ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి డివైడర్‌ను అతి వేగంగా ఢీ కొన్న కారు రోడ్డు అవతలి పొలాల్లోకి దూసుకొని పోయింది. దీంతో రమణారెడ్డి(55) అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. రూరల్ ఎస్ఐ వరప్రసాద్ ప్రమాద స్థలాన్ని చేరుకొని మృత దేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వినయ్‌ని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం లభ్యం

పాములపాడు, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌కు ఉధృతంగా ప్రవహించిన వాగులో గల్లంతైన జెల్లె నాగేశ్వరరావు (47) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. కొత్తపల్లి మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన జెల్లె నాగేశ్వరరావు ఈ నెల 29న పాములపాడులో మెడిసిన్ కొనుగోలు చేసి తిరిగి ఊరికి వెళ్లడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి వాగును మోటారు సైకిల్‌పై దాటుతుండగా నీటి ప్రవాహంలో వాహనంతో సహా కొట్టుకుపోయాడు. మూడు రోజులుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. శుక్రవారం సాయంత్రం పాములపాడు గ్రామ శివార్లలోని పంటపొలాల్లో మృతదేహం లభ్యమైంది. శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పచెప్పినట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు.

ఇనుపకడ్డీల్లో ఇరుక్కొని రైతు మృతి

చాగలమర్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో ఉన్న మంగమ్మ బరకలు సమీపంలో భవనాశి వాగు నుంచి ముత్యాలపాడు చెరువుకు నీరు సరఫరా చేసే తూముకు అడ్డుకట్ట వేసే క్రమంలో ఇనుప కడ్డీలలో ఇరుక్కొని రైతు రంగయ్య (61) శుక్రవారం మృతి చెందాడు. భవనాశి వాగు నుంచి ముత్యాలపాడు చెరువుకు నీరు తరలించేందుకు తూము ఏర్పాటు చేశారు. అధిక వర్షాలతో భవనాశి ఉధృతంగా ప్రవహించడంతో తూము నుంచి భారీగా నీరు సమీప పంట పొలాల్లో ప్రవహించి నీట మునిగాయి. దీంతో ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతులు రంగయ్య, సుబ్రమణ్యం, నరసింహుడు, బడేబాయి, రామమూర్తిలతో పాటు మరి కొందరు తూమును మూసి వేసేందుకు ఇనుప కటాంజనం తీసుకెళ్లారు. దాన్ని ఏర్పాటు చేసే సమయంలో రంగయ్య ఇరుక్కుపోయాడు. నీటి ప్రవాహం అధికమవడంతో కటాంజనం తీసే ప్రయత్నంలో రంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన రంగయ్యను నీటిలో నుంచి తోటి రైతులు బయటకు తీశారు. ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ముగ్గురు సంతానం. . భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వపరంగా సాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

● రైతు మృతికి సంతాపం

మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన రంగయ్య ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పాల డైరీ చైర్మన్ రమణారెడ్డి, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఉద్యోగాల పేరుతో మోసం

● నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు

● కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాధితులు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో డోర్నిపాడు మండల కేంద్రానికి చెందిన వీరారెడ్డి, అతని అల్లుళ్లు మోసం చేశారని బాధితులు వాపోయారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో హెల్త్ అండ్ వెల్త్ కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలిస్తామని, ఒక్కొక్కరికి నెలకు రూ.40 వేల చొప్పున వేతనం ఉంటుందని సుమారు 2000 మందితో ఒక్కొక్కరి వద్ద రూ.3.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగం ఆశతో ఇంట్లోని బంగారం, ఇళ్లు, ఆస్తులు తాకట్టు పెట్టి, అప్పులు చేసి నిర్వాహకులకు డబ్బు చెల్లించామన్నారు. గత నెల నుంచి వేతనం ఇవ్వకపోగా కంపెనీ యాజమాన్యం ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నారన్నారు. ఈవిషయమై ఈ నెల 7వతేదీ నుంచి 10 వతేదీ వరకు డోర్ని పాడులో ఆందోళనలు చేపట్టినట్లు వారు తెలిపారు. దీనికి స్పందించిన పోలీసు యాజమాన్యం న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకున్నా మన్నారు. ఇంతవరకు పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కలెక్టర్, ఎస్పీ న్యాయం చేస్తారని ఇక్కడకు వచ్చామన్నారు. పోలీసు అధికారుల నిర్లక్ష్యంతోనే పుట్టగొడుగుల్లా మోసపూరిత కంపెనీలు వస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయని పక్షంలో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దళారులతో మోసపోకండి

● మార్కెట్‌యార్డు చైర్మన్ హరిబాబు

● పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



బ్రోచర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ హరిబాబు, మార్కెట్ కమిటీ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చి తమ పంటను అమ్ముకోవాలి మార్కెట్‌యార్డు చైర్మన్ హరిబాబు అన్నారు. అయ్యలూరుమెట్ట సమీపంలో మురారి పత్తి మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రా రంభించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పత్తి పంటకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల జిల్లా ఉప మార్కెటింగ్ సంచాలకులు కల్పన మాట్లాడుతూ రైతులు సీసీఐ కేంద్రానికి పత్తిని తెచ్చే ముందు సీసీఐ రూపొందించిన కపాస్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 12శాతం మించి తేమశాతం ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుందన్నారు. పత్తి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్‌రహిమాన్, మార్కెట్‌యార్డు డైరక్టర్ స్వామినాయక్, సహాయకార్యదర్శి శేషిరెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలుపుదల

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కనీస మద్దతు ధరతో రైతుల నుంచి శని, ఆదివారాలు పత్తి కొనుగోళ్లు నిలిపివేసిందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు శుక్రవారం తెలిపారు. సీసీఐకి విక్రయించుకునే రైతులు తమ పత్తిని తీసుకురావద్దని సూచించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు యథావిధిగా సీసీఐ పత్తి కొనుగోళ్లు ఉంటాయన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఈ విషయాన్ని గమనించి సోమవారం రావాలని తెలిపారు. ఇంటి వద్దనే పత్తి బాగా ఆరబెట్టుకుని తేమ లేకుండా తీసుకురావాలని సూచించారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ డిప్లమా ఇన్ అలైడ్ హెల్త్ కేర్ సర్వీసెస్ కోర్సులకు మిగిలిన సీట్లకు దరఖాస్తులకు అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.వీ. చిట్టినరసమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీడీఆర్‌ఏలో బీసీ-ఏ కేటగిరికి-1, ఈసీజీలో ఓసీ పీహెచ్ కేటిగిరికి-1, డీఏఎన్ఎస్‌లో ఓసీపీహెచ్ కేటగిరికి 1 సీటు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా కేటగిరీలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కాలేజీ ఆఫీసులో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

రేపు జిల్లా ఈత ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో డీఎస్ఏ ఈత కొలనులో ఈ నెల 2వ తేదీన సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలకు ఈత ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి క్రిష్ణ యాదవ్ తెలిపారు. ఎంపికైన స్విమ్మర్లు 16న విజయవాడ, 22న విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారనీ తెలిపారు. వివరాల కోసం 9292757888ను సంప్రదించాలన్నారు.

● స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ చెస్ డివిజనల్ స్థాయి పోటీలు శనివారం ఉదయం 9 గంటలకు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఏ పీఈ డివిజినల్ కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని మండల ఇన్‌చార్జిలు తమ మండల జట్లను తీసుకుని రావాలని కోరారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం



ఫారెస్టు కార్యాయలం ఆవరణంలో ఉన్న నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ విజయ్‌కుమార్

రుద్రవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అడవుల్లో జరిగే అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎఫ్‌డీపీటీ (ఫీల్డ్ డైరెక్టరు ప్రాజెక్టు టైగర్) విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని ఫారెస్టు కార్యాలయ ఆవరణంలోని నర్సరీలో మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రూ.20 కోట్ల మేర పచ్చర్ల, గాజులపల్లె, చెలిమ ప్రాంతాల్లో అక్రమ రవాణా జరుగుతుందన్నారు. అడవులు ప్రజల ఆస్తి అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఉద్యోగులు పనిచేయలేకపోతే సెలవులో వెళ్లాలని సూచించారు. నల్లమల అటవీలో వన్య ప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అక్రమ రవాణా, వేటగాళ్లకు సిబ్బంది సహకరించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట రేంజర్ ముర్తుజావలి ఉన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా 240 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందన్నారు. జిల్లాలో 2203 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, బీజేపీ పార్టీ తరుపున పీటీ సాయి ప్రదీప్, టీడీపీ ఎల్‌వీ ప్రసాద్, జనసేన మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 15వ వార్డులోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ పార్కులో 15వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పామన్న ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శివమ్మ, ఇన్‌చార్జి పామన్న, నాయకులు అబ్బాస్, జేమ్స్ రవికుమార్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు

బండిఆత్మకూరు అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్నదేవళాపురం, నారాయణపురం గ్రామాల్లో సర్పంచులు ఆవులపాటి మధు, యండూరి సరిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను డీపీవో తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సురేష్‌రెడ్డి, శంకర్, విష్ణు, ఎంపీడీవో గాయత్రి, ఈవోపీఆర్డీ రామ కృష్ణవేణి, కార్యదర్శి అక్బర్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు కృషి చేయాలి

మహానంది, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు జనసంరక్షణ సమితి సభ్యులు కృషి చేయాలని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి అన్నారు. శుక్రవారం అబ్బీపురంలో వీఎస్ఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షురాలిగా నాగమణి, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది రాణా ప్రతాప్, రామకృష్ణ, పరమేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నీసా
- తూతూ మంత్రంగా సాధారణ సమావేశం



వాగ్వాదం చేస్తున్న వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు


ఛైర్‌పర్సన్ మాబున్నీసా

నంద్యాల టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నీసా కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం కూడా తూతూ మంత్రంగానే సాగింది. ముందుగా అజెండాను ప్రవేశపెట్టిన సమయంలో టీడీపీ కార్యాలయానికి అనుమతిగా మొదటి అజెండాను ప్రతిపాదించారు. వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ మాబువలి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉండి కూడా ఎందుకు మీరు వైసీపీ కార్యాలయానికి అనుమతి తెచ్చుకోలేదన్నారు. టీడీపీ కార్యాలయం బిల్లు రద్దు చేయడంతో టీడీపీ కౌన్సిలర్లు బాయ్‌కాట్ చేశారు. ఛైర్‌పర్సన్ మిగిలిన 31అజెండా అంశాలను చదివి పాస్‌చేశారు. అనంతరం ప్రవేశపెట్టిన బిల్లుల్లో మున్సిపాలిటీకి సంబంధించి షాపులకు రెన్యువల్ చేసే విషయంలో చట్ట ప్రకారం వ్యవహరిస్తున్నామని, ఇందుకు ఎవరూ అడ్డు రావద్దని కమిషనర్ బండి శేషన్న కోరారు. వైసీపీ కౌన్సిలర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ స్వయంగా మంత్రి ప్రారంభించి నాలుగు నెలలవుతున్నా ఇంతవరకు ఎక్కడా కూడా పనులు ప్రారంభం కావడం లేదని వారి దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రాధాన్యతను బట్టి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. 4వ వార్డు కౌన్సిలరు మూడు నెలల నుంచి కౌన్సిల్‌కు హాజరు కానందున ఈ కౌన్సిల్‌కు హాజరు కావద్దని ఛైర్‌పర్సన్ వెనక్కి పంపించారు. అధికారులు ఛైర్‌పర్సన్‌కు, కౌన్సిల్ సభ్యులకు గానీ గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు సాధిక్, సావిత్రమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరం లాంటిదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.12,57,504 చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైల నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా చేయూత కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెన్నా శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యే బుడ్డా పరామర్శించారు.

శివాలయ పునర్నిర్మాణానికి సహకరించాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న బైరెడ్డి శంకరమ్మ, ఈవో స్వర్ణముఖి

నంద్యాల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అయ్యలూరు గ్రామంలో శివాలయ పునర్నిర్మాణానికి సహకరించాలని టీడీపీ నాయకురాలు బైరెడ్డి శంకరమ్మ, ఆలయ ఈవో స్వర్ణముఖి కోరారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ పునర్నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయావన్నారు. రీ ఎస్టిమేషన్ వేయించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డితో చర్చించి ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

కొత్తపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతిలోని వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్ర ఆవరణలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంతో పాటు కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సేగు కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో దొంతు నరేష్, గోళ్ల సత్యనారాయణ ఉన్నారు.

శరవేగంగా రోడ్డు పనులు

నంద్యాల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని వైఎస్ఆర్ నగర్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు టీడీపీ 38వ వార్డు ఇన్‌చార్జి బుగ్గరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన పనులు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేశ్‌బాబు, వడ్డే నాగేంద్ర, హిమామ్ హుస్సేన్, చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

నందికొట్కూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డా. ధార సుధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు బైరెడ్డి నగర్, జీవనజ్యోతి స్కూల్ వద్ద ఆరబోసిన మొక్కజొన్న, దెబ్బతిన్న ఉల్లి, పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాజ కుమారికి వినతి పత్రం సమర్పించారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ఏఐటీయూసీ వ్యవస్థానక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా యూనియన్ల సెంటర్ల వద్ద ఆ సంఘం నాయకులు రమేష్ బాబు, సీపీఐ నాయకులు ప్రతాప్ జెండాలు ఎగురవేశారు. వెంకటశివుడు, ముర్తుజాబీ, మున్న, షేక్షావలి ఉన్నారు.

మహానందిలో బీసీ రాజారెడ్డి పూజలు


రాజారెడ్డిని సత్కరిస్తున్న ఈవో, అర్చకులు

మహానంది, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో అరుణభారతి వ్యవస్థాపకులు, బనగానపల్లి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణమంటపంలో బీసీ రాజారెడ్డిని వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో మధు పాల్గొన్నారు.

'ఉద్యం' రిజిస్ట్రేషన్‌పై అవగాహన

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈలు 'ఉద్యం' రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ప్రభుత్వం పథకాలు సులభంగా పొందవచ్చని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మహబూబ్‌బాషా అన్నారు. శుక్రవారం నంద్యాలలోని జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో అవగాహన కల్పించారు.

నంద్యాలలో హాకీ శతాబ్ది ఉత్సవాలు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారత జాతీయ హాకీ శతాబ్ది ఉత్సవాలను నంద్యాల ఎస్పీజీ పాఠశాల మైదానంలో ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ సంఘం అధ్యక్షుడు చాణక్యరాజ్ శుక్రవారం తెలిపారు. పూర్వ క్రీడాకారులను సన్మానిస్తామన్నారు. ఈ నెల 4న తెలుగులో వ్యాసరచన పోటీలు, 6న ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డా.రవికృష్ణ, నంద్యాల హాకీ సంయుక్త కార్యదర్శి దివాకర్, ఉపాధ్యక్షుడు స్టీఫెన్, కోచ్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

గడివేముల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మండల అధికారులు తమ శాఖల అభివృద్ధి పనులను వివరించారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవగుప్త, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ అంగజాల గీత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి పటేల్



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ అన్నారు. శుక్రవారం పటేల్ జయంతి సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఏక్తా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ చిత్రపటానికి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణయ్య, అధ్యాపకులు విద్యాసాగర్, శశిధరయ్య, వెంకటసుబ్బయ్య పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నందికొట్కూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కె. వెంకటేశ్వర్లు, మద్దయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుస్మిత పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు ప్రాంతంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎట్టకేలకు వరద తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం ఉదయం నుంచి ఆయా రహదారుల్లో వాహనాల రాకపోకలు సాగాయి. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము ఉదయాన్నే ఆయా ప్రదేశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

తగ్గని వరద ఉధృతి

చాగలమర్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టిన వక్కిలేరు, కుందూలో వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం కూడా కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె, నేలంపాడు, గొట్లూరు గ్రామాల సమీపంలో వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లో కూడా నీరు అలాగే నిల్వ ఉంది. మొంథా తుఫాన్‌తో పంటలతో పాటు వ్యవసాయ విద్యుత్ మోటార్లు నీట మునిగి రైతన్నలకు నష్టం కలిగించాయి. 10 వేల ఎకరాల దాక వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లోకి చేరిన నీరును బయటకు వెళ్లగొట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. అధిక వర్షాలతో 49 మట్టిమిద్దెలు కూలిపోయి ఆయా కుటుంబాలకు భారీ నష్టం వాటిల్లింది. పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

చాగలమర్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర కమిటీ కన్వీనర్ నాగేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. చాగలమర్రి ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్ ఆధ్వర్యంలో శుక్రవారం గొడిగనూరు, డి.వనిపెంట, చెంచుగూడెం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కస్తూర్బాలోని ఉపాధ్యాయులకు మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింప చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అదనపు కార్యదర్శి ఉస్మాన్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు సామగ్రి వితరణ

డోన్ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఏయస్ కుమార్ పాఠశాలకు వాష్‌బేసిన్లు, ఇతర వస్తు సామగ్రిని వితరణ చేశారు. కార్యక్రమానికి ఎంఈవో-1 ప్రభాకర్, ఎంఈవో-2 రఘునాయక్, ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధనగట్టులో నేడు ఎమ్మెల్యే పర్యటన

డోన్ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం సిద్ధనగట్టు గ్రామంలో శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పర్యటిస్తారని టీడీపీ మండల నాయకులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని, అలాగే డోన్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో జాన్సన్ ప్రభుత్వ చౌక దుకాణ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

బనగానపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లో కొత్తూరు గ్రామంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గణపతి, పార్వతి, ఈశ్వరనంది, సీతారామాంజనేయ, కృష్ణుడు విగ్రహాలను వేదపండితుల సమక్షంలో ప్రతిష్ఠించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు విగ్రహాలకు పూజలు చేశారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



కొలిమిగుండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

కొలిమిగుండ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికులకు అండగా ఏఐటీయూసీ నిరంతరం పనిచేస్తుందని సంఘం నాయకులు చంటి, కంబగిరి, మహేష్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినం సందర్భంగా జెండాను ఆవిష్కరించి, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుల్లయ్య, పెద్దయ్య, సూరి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుకు: కార్మికులు ఐక్యమత్యంతో హక్కులను సాధించుకోవాలని ఏఐటీయూసీ నాయకుడు నాగాంజనేయులు అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినం సందర్భంగా అవుకు బస్టాండు సర్కిల్‌లో కార్మికులతో కలసి జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సునీల్‌యాదవ్, పుల్లయ్య, రజాక్‌బాషా, రమేష్, రవినాయక్, మహేష్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి తిరుమలేష్‌లు హాజరై జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఉదయ్, మండల నాయకులు బాలు, ప్రదీప్, గోపి, ఏసన్న, ధనుంజయ, మారుతి, రామదాస్, ఇదుర్స్‌బాషా, వలి బాషా పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చాగలమర్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి, ఏవో రంగనేతాజీ శుక్రవారం పరిశీలించారు. శెట్టివీడు, గొడిగనూరు, ముత్యాలపాడు గ్రామాల్లో నీట మునిగిన మొక్కజొన్న, మినుము, ఉల్లి పంటలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో పంటలు నీట మునిగి దెబ్బతినడంతో పంట నష్టం అంచన వేస్తున్నామని, రెండు రోజుల్లో నివేదికలను కలెక్టర్‌కు పంపిస్తామని అన్నారు. వారి వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

49 మట్టిమిద్దెలు కూలిపోయాయి

చాగలమర్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షానికి మట్టిమిద్దెలు తడిచి కూలిపోయాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూలిన మట్టిమిద్దెల వివరాలను సేకరించామని, మండలంలో మొత్తం 49 మట్టిమిద్దెలు కూలిపోయాయని అన్నారు. పరిహారం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. నేలంపాడు గ్రామంలో 12 గృహాల్లో వరద నీరు ప్రవేశించిందని, 14 గృహాల్లో పాక్షింగా నీరు ప్రవేశించిందన్నారు.

మానవత్వం చాటుకున్న పశువైద్య సిబ్బంది

చాగలమర్రి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని శెట్టివీడు రహదారిలో ఓ ఆవు ప్రసవ వేదనతో నరకయాతన పడుతోంది. సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు దానిని గమనించి పశుసంవర్థకశాఖ ఏడీ వరప్రసాద్‌కు సమాచారం అందించారు. తక్షణమే పశువైద్య సిబ్బందిని అక్కడికి పంపించి వైద్య చికిత్సలు చేయడంతో ఆవుకు సుఖప్రసవం జరిగింది. ఉమ్మనీరు అధికంగా తాగడం వల్ల ఆవు ప్రసవం అయ్యేందుకు ఇబ్బంది పడిందని ఏడీ పేర్కొన్నారు. పశువైద్య సిబ్బంది సజిలి, మహబూబ్‌బాషా, నవీ న్‌లు మానవత్వం చాటుకున్నందుకు వారిని అభినందించారు.

కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతా

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె వంద పడకల ఏరియా వైద్యశాలను కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రూ.13 లక్షల విలు వగల 17 కంప్యూటర్లను ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవితో కలిసి ప్రారంభించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగి యొక్క వివరాలను కంప్యూటరీకరించనున్నట్లు తెలిపారు. ఇందులో రోగికి సంబంధించిన వ్యాధి, నివారణ మందులు, డాక్టర్ల ట్రీట్‌మెంట్ వివరాలు పొందుపరచనున్నట్లు తెలిపారు. అలాగే రూ.కోటితో ఆస్పత్రికి అవసరమైన అధునాతన వైద్య పరికరాలు తెప్పిస్తున్నట్లు తెలిపారు. అనం తరం కంప్యూటర్ గదులను, ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు శైలజ, రాఘవేంద్రారెడ్డి, ఏఈ సాయికృష్ణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు టంగుటూరు


కంప్యూటర్లను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

శ్రీనయ్య, నియాజ్‌హుసేన్, అహమ్మద్ హుస్సేన్, సహకార సంఘం చైర్మన్ అబ్దుల్ కలాం, అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్, బత్తుల భాస్కర్‌రెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, రాయలసీమ సలాం, షబ్బీర్, లాయర్ నాగేంద్రారెడ్డి, ఇస్మాయిల్ ఖాన్, బత్తుల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువులో రాణించాలి


విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువులో రాణించాలని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణ శివారులోని కేజీబీవీ పాఠశాలలో కోట్ల సుజాతమ్మ సొంత నిధులతో కేజీబీవీ పాఠశాల విద్యను అభ్యసిస్తున్న 272 మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేజీబీవీ పాఠశాలలో సందర్శించి విద్యార్థినుల యోగక్షేమాలు అడిగి తెలుసుకు న్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ పట్టణ కన్వీనర్ బుగ్గన ప్రసన్నలక్ష్మి, నాయకులు భీమేశ్వరరెడ్డి, బుగ్గన ఆనందరెడ్డి, మేకల నాగరాజు, రూబెన్, టైలర్ రాముడు, పుట్టపాశం వెంకటేశ్వర్లు, నాగేశ్వరరెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ అబీదాబేగం పాల్గొన్నారు.

పటేల్‌కు ఘన నివాళి

ప్యాపిలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సరస్వతి శిశుమందిరంలో శుక్రవారం దివంగత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్‌పాటి, రామక్రిష్ణ, ఓబులేసు, ప్రధాన ఆచార్యులు పార్వతమ్మ, వాసు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ఐకమత్యతే దేశానికి రక్ష అని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కళాశాలలో ఏక్తా దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేసి ఐక్యతా ర్యాలీలో పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రానికి అధ్యాప కులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ లలిత, అధ్యాపకులు బడే సాహెబ్, కౌసల్యాదేవి, ఉమామ హేశ్వరరెడ్డి, ఫాతిమా పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అపుస్మా అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక విశ్వాశాంతి పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు దేశభక్తి గురించి వివరించారు.

కోవెలకుంట్ల: స్థానిక వాసవి బొమ్మిడాల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసు బ్బారెడ్డి, భాస్కర్ నాయక్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పటేల్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.


ఆళ్లగడ్డలో..


శిరివెళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న పిన్సిపాల్, అధ్యాపకులు


బనగానపల్లెలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


కోవెలకుంట్లలో..


ప్యాపిలిలో..

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

బనగానపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె జూని యర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ ఆదేశాల మేరకు బనగానపల్లె పట్టణంలో లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై శుక్రవారం న్యాయవాదులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు ఆవరణం నుంచి పెట్రోల్‌బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఇటీవల కర్నూలు సమీపంలో ప్రైవేటు ట్రావెల్స్ అగ్ని ప్రమాదానికి గురై 19 మంది మృత్యువాత పడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమా దాలు జరుగకుండా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కక్షిదారులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ప్లకార్డులు పట్టుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, లీగల్ సెల్ కమిటీ సిబ్బంది ఉమామహేశ్వరి, రేణుక, న్యాయవా దులు తులసీశ్వరమ్మ,


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

నరసింహారెడ్డి, అల్లావుద్దీన్, ముజఫర్‌హుసేన్, శ్రీనివాసమూర్తి, అజాంహుసేన్, రాజశేఖర్, అఖిల్, దౌలత్‌ఖాన్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులతో సూపరింటెండెంట్

ఆళ్లగడ్డ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. శుక్రవారం స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనపరిచిన ఆర్‌ఆర్ అకాడమీ క్రీడాకారులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఆళ్లగడ్డ నుంచి మొట్టమెదటి సారిగా అమ్మాయిలు ఎంపిక కావడం గర్వించ దగ్గ విషమన్నారు. రిశ్వహర్షిని, మధు వర్షినిలు అక్క చెల్లెలను ప్రోత్సహిస్తున్న తల్లితండ్రులు నాగేశ్వరరావు, కళ్యాణి దేవిలను ఆమె అభినందించారు. కోచ్ సుబ్బారాయుడు మాట్లాడుతూ రిశ్వహర్షిని, మధు వర్షినిలతో పాటు అండర్ 14 బాలుర విభాగంలో హెమంత్ నాయక్ అంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

వంతెన పరిశీలన

రుద్రవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని ఎర్రగుడిదిన్నె వంతెన దెబ్బతింది. శుక్రవారం ఎస్ఐ మహ్మద్‌రఫి, ఆర్‌అండ్‌బీ అధికారులు కలిసి దెబ్బతిన్న వతెనను పరిశీలించారు. మరమ్మతులు చేసేందుకు నివేదికలు పంపిస్తున్నట్లు వారు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

సంజామల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సంజామల పీహెచ్‌సీ డాక్టర్ శివశంకరుడు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం సంజామల బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి మునిరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానంది ఆలయ అభివృద్ధికి కృషి


బీసీ రాజారెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న ఈఓ, అర్చకులు

మహానంది, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని బనగానపల్లి మాజీ సర్పంచ్, అరుణభారతి వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మహానంది ఆలయానికి వచ్చిన ఆయన్ను ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని అభిషేక పూజలను నిర్వహించారు. కల్యాణమంటపంలో బీసీ రాజారెడ్డిని వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ ఈఓ, అర్చకులు సన్మానించి ప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి దాతలు శుక్రవారం రూ.3.50 లక్షల విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికి అందించారు. బెంగళూరుకు చెందిన రమేశ్, వారి కుటుంబ సభ్యులు చౌడేశ్వ రీమాతకు విరాళం మొత్తాన్ని పీవీ.కుమార్‌రెడ్డి చేతులమీదుగా అం దించారు. పీవీ.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి: ఎంపీడీవో

ఉయ్యాలవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 6 నుంచి 17 ఏళ్లలోపు వయస్సు వారికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాల లోని ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

అంతర్జాతీయ పోటీలకు పీడీ ఎంపిక

సంజామల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పోటీలకు సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకుడు బాషా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షబ్బీర్ హుసేన్ శుక్రవారం తెలిపారు. నవంబరు 5వ తేదీ నుంచి 9 వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై జవర్‌హల్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 23వ ఏసియా మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటార న్నారు. బెంగళూరులో జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 40 + క్యాటగిరిలో హైజంప్, షాట్‌పుట్‌లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి బాషాను అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవన మనుగడకు మొక్కలే ఆధారం

కోవెలకుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జీవన మనుగడకు మొక్కలే ఆధారమని కోవెలకుంట్ల ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు విక్రమ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పేట స్కూలులో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు విక్రమ్, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

రుద్రవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో మహేశ్వరి అనే విద్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మోడల్ మెడల్ సాధించారన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, పీడీ శ్రీనివాసులు అభినందించారు.

237 హెక్టార్లలో పంట నష్టం

ఉయ్యాలవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో తుఫాన్‌తో 237 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 142 హెక్టార్లలో వరి, 37 హెక్టార్లలో కంది, 44 హెక్టార్లలో మొక్కజొన్న, 5 హెక్టార్లలో పత్తి, 8 హెక్టార్లలో మినుము, ఉల్లి, మిరప, బెండ, పెసర పంటలు దెబ్బ తిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి తుది జాబితా తయారు చేస్తామన్నారు.

పందులను దూరంగా తరలించాలి: కమిషనర్


పందుల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పందులను పట్టణానికి దూరంగా తరలించాలని నగర కమిషనర్ హరిప్రసాద్ పందుల యజమానులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో పందుల యజమానులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని బహిరంగ ప్రదేశాలలో పందులు సంచరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వచ్చినందున పందుల యజమానులు 15 రోజుల్లోపు వాటిని ఊరికి దూరంగా తరలించాలని తెలిపారు. పందుల యజమానుల అభ్యర్థన మేరకు 30 రోజుల గడువు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ సువర్ణ లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ మధు కుమార్, మేస్త్రీలు రమణ, కిరణ్, విష్ణు పాల్గొన్నారు.

నేడు మంత్రి బీసీ రాక

అవుకు/కోవెలకుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం అవుకు, కోవెలకుంట్ల మండలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి వివరాలను వెల్లడించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం

డోన్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారం భిస్తున్నట్లు డోన్ ప్రైవేటు డాక్టర్ల అసోసియేషన్ కార్యదర్శి డా.రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన భరోసా, సానుకూల చర్యలను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ వైద్యసేవల పథకం కింద తక్షణ ఆరోగ్యశ్రీ సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు ఏపీ సూపర్ స్పెషాలిటీ అసోసియేషన్ (ఏఎస్‌హెచ్‌ఏ) నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపు

శిరివెళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శిరివెళ్ల లోని మూడో సచివాలయ పరిధిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా బడ్జెట్ కేటాయించినట్లు వైద్యులు ముఖేష్ కుమార్, ఆంజనేయులు, సీహెచ్‌వో రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామంలోని 9వ వార్డు నుంచి 13వ వార్డు పరిధిలో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి అవసరమైన ఐదు సెంట్ల స్థలాన్ని దాతలు ముందుకు రావాలని కోరారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి


సంతకాల సేకరణలో వైసీపీ నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపాలని కోరుతూ పట్టణంలోని పలు వార్డులలో వైసీపీ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని 10, 11 వార్డులలో వైసీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌ఈ రాజావర్దన్, క్వాలిటీ అబ్దుల్లా, బుర్రు శ్రీధర్ నాయుడు, డీలర్ రవి, రాజేష్ కుమార్ నాయుడు, శ్రీనాథ్, రాజశేఖర్, రాజకొండయ్య పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని 30వ వార్డులో వైసీపీ నాయకుడు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్ ఆర్ట్ రమణ, వైసీపీ నాయకుడు గడ్డం సురేష్‌లతో కలిసి పట్టణంలోని 30వ వార్డు ఇందిరానగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.